## క్లుప్తంగా

### అంతర్ పంటలు సాగు చేయాలి

మద్దిపాడు: శనగపంటకు బదులు అంతర్ పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రమేష్ సూచించారు. మంగళవారం మండలంలోని రాచవారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో శనగ పంట ఎండిపోతోందని రైతులు తెలుపుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో దానికి బదులుగా అంతర్ పంటలు రెండు మూడేళ్ల పాటు వేసుకుంటే నేల సారవంతమవుతుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీ శైలజ మాట్లాడుతూ శనగ పంటలో విత్తనం వేసే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని తెలిపారు. అవసరాన్ని మించి ఎరువులు వాడరాదని ఆమె రైతులకు సూచనలు చేశారు. గ్రామ రైతులు పలువురు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, జింకు, జిప్సం అందించాలని కోరారు. వారి వెంట ఏఈఓ శేషయ్య, వీఏఏ చాందిని, పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.

### ఓవర్ లోడింగ్‌తో ప్రమాదాలు



ట్రాక్టర్ డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎంవీఐ కిరణ్ ప్రభాకర్

ఒంగోలు: పరిమితికి మించి వాహనంలో లోడింగ్ చేయడం ద్వారా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక పేర్నమిట్ట సమీపంలో పొగాకు వేలం కేంద్రానికి వస్తున్న ట్రాక్టర్లను ఆపి డ్రైవర్లకు తగు సూచనలు చేశారు. ట్రాక్టర్లకు సైడు చెక్కలు దించి లోడింగ్ చేయడం వల్ల ప్రమాదం సంభవించే పరిస్థితులు గురించి కూలంకషంగా వివరించారు. దీనివల్ల ప్రాణనష్టంతోపాటు ఆస్తినష్టం కూడా సంభవిస్తుందని హెచ్చరించారు. కేసులు నమోదు చేస్తామన్నారు.

### చిల్లచెట్ల తొలగింపు



చిల్ల చెట్లు తొలగిస్తున్న జేసీబీతో ఎస్ఐ శివరామయ్య

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి నుంచి దొడ్డవరం వెళ్లే దారిలో రాజుల మిట్ట సమీపంలోని మలుపు వద్ద చిల్ల చెట్లను ఎస్ఐ శివరామయ్య ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. మండలంలోని పలు రోడ్లపై మలుపులు ఉన్న నేపథ్యంలో ఆవతలి నుంచి వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎస్ఐ శివరామయ్య పూనుకుని ఇటువంటి మలుపుల వద్ద చిల్ల చెట్లు పీకించి వాహనాలు కనిపించే విధంగా చర్యలు తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

కొత్తపట్నం: ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు, బహుజన టీచర్స్ అసోసియేషన్ సభ్యులు డిమండ్ చేశారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవిని కలిసి సభ్యత్వం కట్టించి ప్రారంభించారు. పర్రె వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్ చంద్ర బాబు, జిల్లా కార్యదర్శి పల్లె తిరుపతిస్వామి, నన్నేసాన్ని భాస్కరరావు, కొప్పోలు కిషోర్ కుమార్, చెక్క కోటేశ్వరరావు, చిటితోటి రామకృష్ణారావు పాల్గొన్నారు.

# కార్మికుల ఆరోగ్యం.. నగరం పరిశుభ్రం

- ఆరోగ్య శిబిరం ప్రారంభంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా
- నగర పాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



మెడికల్ క్యాంప్ ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ఒంగోలు నగరం పరిశుభ్రంగా ఉంటుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వివిధ వైద్య పరీక్ష శిబిరం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఆస్టర్ రమేష్ వైద్యశాలలు సంయుక్తంగా ఈ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తోందన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ మెగా మెడికల్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాల మేరకు మందులు వేసుకొంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వర్ణాంధ్ర ఎట్ 2047 కార్యక్రమానికి సంబంధించి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ తప్పనిసరిగా చేసి అందులోగల ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలని సచివాలయ కార్యదర్శులకు, నగర పాలక సంస్థ సిబ్బందికి సూచించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2 జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వరకు నిర్వహిస్తారని తెలిపారు. నగర పాలక సంస్థలో ఇలాంటి ఉచిత మెడికల్ క్యాంపులు తరచూ ఏర్పాటు చేసి పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కమిషనర్‌కు సూచించారు. మందులు ఉచితంగా అందించాలన్నారు. కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంపులు తరచూ నిర్వహిస్తామన్నారు. నగర పాలక సంస్థలో బాగా పనిచేసే వారిని గుర్తించి వారికి హెల్త్ ఇన్సూరెన్స్‌ని ఇప్పిస్తామని వెల్లడించారు. ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన వైద్యులను ప్రత్యేకంగా సన్మానించారు. అన్నిరకాల విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించారు. మేయర్ జి.సుజాత, వైద్యులు ఆంజనేయులు రెడ్డి, పీవీ రవీందర్ రెడ్డి, లావణ్య, శ్యాం సుందరి, డీఎంఅండ్ హెచ్ఓతో పాటు నగర పాలక సంస్థ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ఓపీ వద్ద క్యూలో పారిశుద్ధ్య కార్మికులు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

# ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం





ఎస్ఎస్ఎన్ కాలేజీలో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ అధికారి రాజేంద్రబాబు



డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి

ఒంగోలు: స్థానిక ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. కాలేజీ చైర్మన్ యల్లటూరి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు. సమాజ సేవలో భాగస్వాములు కావాలని, ఉన్నత చదువులు చదివితే నేటి యువతకు విద్య, విజ్ఞానంతోపాటు సమాజ సేవ పట్ల బాధ్యత వహించాలన్నారు. డైరెక్టర్, ప్రిన్సిపాల్ వై. సత్యన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ శతజయంతి పురస్కరించుకుని భారత ప్రభుత్వం సెప్టెంబర్ 24వ తేదీన ప్రతి ఏటా జాతీయ ఎన్ఎస్ఎస్ దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎన్ఎస్ఎస్ గీతాలు, ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.రాజేంద్రబాబు, టి.రాజశేఖరరెడ్డి, ఎస్‌కే నిరూషా, కె.పావని, ఆర్.జోసెఫ్, వై.పూర్ణచంద్రరావు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

**డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..**

స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డి.అనంతలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థులు సేవా భావాన్ని కలిగి వారు తమ లక్ష్యాల్ని సాధించుకోవాలని వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. సుధారాణి మాట్లాడుతూ 'నాట్ మీ బట్ యు' అనే నినాదం అర్థం చేసుకోవాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

# ఉల్లాసంగా క్రీడా పండుగ



ఖోఖో ఆడుతున్న దృశ్యం



స్కూల్‌గేమ్స్‌లో చెస్ ఆడుతున్న విద్యార్థినులు

ఒంగోలు: చిన్నారుల ఆటల పోటీల్లో క్రీడోత్సాహం వెల్లివిరిసింది. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఒంగోలు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్య సమస్యలను అధిగమించగలుగుతామని, మరింత ప్రతిభను కనబరిస్తే క్రీడా ప్రోత్సాహంతో త్వరగా జీవితంలో స్థిరపడేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. కనుక ప్రతి ఒక్కరూ ఆటల పోటీలను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలని, ఈ క్రమంలో ఆటల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఐక్యతాభావాన్ని పాటించాలన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త సోమినేని సురేష్ బాబు మాట్లాడుతూ ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో జరిగిన పోటీల్లో రాణించిన జట్లకు నియోజకవర్గ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం, యోగా పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతగా నిలిచిన జట్టు త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను ఎస్‌జీఎఫ్ ఒంగోలు, కొత్తపట్నం మండల కోఆర్డినేటర్లు వెంకటేశ్వర్లు, సాయికిషోర్‌తో పాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న ఒంగోలు, కొత్తపట్నం జట్లు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

# కౌలు ధరలు పెంచి రైతులు నష్టపోవద్దు

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి, పక్కన ఎమ్మెల్యే బీఎన్

మద్దిపాడు: రైతులు కౌలు ధరలు పెంచి వేసి నష్టపోవద్దని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం గ్రేడ్-1 పొగాకు 350 నుంచి 370 రూపాయల వరకూ అమ్ముడయిందన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉండబట్టే మన దగ్గర పొగాకుకు ధర వచ్చిందని తెలిపారు. ధరలు పెరిగిన నేపథ్యంలో రైతులు అత్యాశ పడి కౌలు ధరలు పెంచి పొగాకు వేయడం కూడా సరి కాదని, మార్కెట్‌లో డిమాండ్‌కు తగిన విధంగా పొగాకు పంట వేయాలన్నారు. పంట విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకున్నా ప్రకృతి వైపరీత్యాలు సంబవిస్తుంటాయని, రైతులు కౌలు ధరలు పెంచుకోకుండా పొగాకు సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంతనూతలపాడు శాసన సభ్యుడు బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు ఇన్‌స్రూ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎం లక్ష్మణరావు, ఏఎస్ కోవి రామకృష్ణ, పొగాకు బోర్డు మెంబర్ పొద వరప్రసాద్, మండవ జయంత్‌బాబు, అబ్బూరి శేషగిరి, మహేష్ పాల్గొన్నారు.

## వివిధ పార్టీల నాయకులతో తహసీల్దార్ సమావేశం



అన్ని పార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుజన్‌కుమార్

మద్దిపాడు: మండలంలోని అన్ని పార్టీల అధ్యక్షులతో తహసీల్దార్ సుజన్‌కుమార్ స్థానిక తన కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం ఉన్న పోలింగ్ బూత్‌ల మార్పు, పేరులో తప్పు నమోదు, ఒకే ఇంటిలోని వారు, ఒకే పోలింగ్ బూత్‌లో వేర్వేరు వార్డుల్లోకి వెళ్లి పోవడం వంటి అంశాలపై సూచనలు చేయాలని ఆయన పార్టీల అధ్యక్షులను కోరారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు మాట్లాడుతూ కొష్టాలుకు సీతారాంపురం గ్రామంలోనే పోలింగ్‌బూత్ ఉందని, కొష్టాల దగ్గర ఉన్న వారు ఓట్లు వేయాలంటే జాతీయ రహదారిని దాటి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ దూరం వచ్చి ఓటు వేయాల్సి వస్తోందని తెలిపారు. టీడీపీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ మరణించిన వారి ఓట్లు తీసి వేయాలని, అదేవిధంగా ఒక కుటుంబంలోని ఓట్లన్నీ ఒక బూత్‌లో ఉండేలా లిస్టు తయారు చేయాలన్నారు. వివిధ ప్రదేశాల్లో రెండు ఓట్లు కలిగి ఉన్న వారిని కూడా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ సుజన్‌కుమార్ మాట్లాడుతూ పార్టీల నాయకులు అందించిన సూచనలను ఉన్నతాధికారులకు మినిట్స్ బుక్‌లో రాసి పంపుతామని తెలిపారు. సూచనలు చేసినందుకు పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ అధ్యక్షుడు చెన్నుపల్లి రమణ, సీపీఎం అధ్యక్షురాలు ఉబ్బా ఆదిలక్ష్మి, డీటీ ఆశాజ్యోతి, రీసర్వే డీటీ షేక్ మహ్మద్ రఫీ, సీనియర్ అసిస్టెంట్ ఎంపీ నాగేశ్వరరావు ఎలెక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ బొంతా మరియదాసు పాల్గొన్నారు.

# పాఠశాలను సందర్శించిన డీఈఓ



జిల్లా అధికారులతో బధిరుల పాఠశాల విద్యార్థులు

చీమకుర్తి: జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ జి.అర్చన మంగళవారం స్థానిక ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలను సందర్శించారు. బధిరులకు అందిస్తున్న విద్యాప్రమాణాలు, సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో దివ్యాంగులకు అందిస్తున్న స్పెషల్ కోర్సుల గురించి ప్రిన్సిపాల్ అంజిరెడ్డి వివరించారు. డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావుతో పాటు ఎంఈఓ శివాజీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పద్యానికి వన్నె తెచ్చిన బండారు కుటుంబం



బండారు పద్మావతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు: పద్యానికి బండారు రామారావు కుటుంబం వన్నెతెచ్చిందని మాల ఉద్యోగుల సంఘం నాయకులు గోపినాథ్, బాబూరావు, డేవిడ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ లైబ్రరీ ప్రాంగణంలో బండార్ రామనాథ మండలి ఆధ్వర్యంలో బండారు పద్మావతి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బండారు రామారావు, బండారు సుశీల, బండారు రవి కుమార్, బండారు పద్మావతి ఖ్యాతిని కొనియాడారు. బండారు పద్మావతి రాష్ట్రంలో చంద్రమతిగా, అర్జునుడిగా అనేక పౌరాణిక పాత్రలు పోషించి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ప్రేక్షకుల హృదయాల్లో నింపుకున్నన్నారన్నారు. అలాంటి బండారు పద్మావతి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఒంగోలులో బండారు రామారావు, చీమకుర్తి నాగేశ్వరరావు విగ్రహాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పౌరాణిక రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి శాంతారావు, హార్మోనిస్ట్ మిడసల వెంకటేశ్వర్లు, సీనియర్ కళాకారులు రామారావు, ఉద్యోగ సంఘ నాయకులు రవి తదితరులు నివాళులర్పించారు.

## ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంస పత్రాలు





ప్రశంస పత్రాలు అందుకుంటున్న వలంటీర్లు

ఒంగోలు: స్థానిక క్విస్ ఫార్మసీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ జాతీయ దినోత్సవం ఘనంగా జరిగిందని కళాశాల యాజమాన్యం డాక్టర్ నిడమనూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, డాక్టర్ గాయత్రి తెలియజేశారు. ముఖ్య అతిథిగా నెహ్రూ యువజన కేంద్రం ఆఫీసర్ కమల్సా పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఎన్ఎస్ఎస్ 1964 సంవత్సరంలో స్థాపించడం జరిగిందని, దీని నినాదం నాట్ మీ.. బట్ యు అని, ఈ సంవత్సరం ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ అని ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని విజ్ఞప్తించారు. అనంతరం, ప్రతిభ కనపరిచిన వలంటీర్లకు ప్రశంస పత్రాలు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్ బాబు, అధ్యాపకులు డాక్టర్ జాలయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ ధన మూర్తి పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల్లో పర్యటన



గుర్రం జాషువా కాలనీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వర రావు మంగళవారం పర్యటించారు. నగర శివారు ప్రాంతం అయిన గుర్రం జాషువా కాలనీతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు రాకుండా కాలువలను శుభ్రం చేసి మురుగు నీరు సజావుగా వెళ్ళే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలువల్లో చెత్తా చెదారం వంటి వ్యర్థాలు తొలగించాలన్నారు. ప్రతి రోజూ చెత్తను తొలగించాలని సచివాలయ సెక్రటరీలను ఆదేశించారు. జేసీబీ సాయంతో చెత్తను తొలగించాలని కూడా ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగం ఏఈ సౌజన్యతో పాటు సిబ్బంది ఉన్నారు.

## పథకాలు అందరికీ అందాలి

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందరికీ చేరేవిధంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. ఒంగోలు మండలంలోని వలేటివారి పాలెంలో మంగళవారం మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దామచర్ల మాట్లాడుతూ సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించటంలో చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

## మోతాదులో రసాయన ఎరువులు వాడాలి

కొత్తపట్నం: రసాయన ఎరువులు అవసరమేరకే వాడుకోవాలని ఏఓ మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలో అల్లూరు, చింతల గ్రామంలో ఉన్న పంట పొలాల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలైన పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మత్స్యశాఖ సహాయకులు ఆంజనేయులు, వ్యవసాయ సహాయకులు నాగలక్ష్మి పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా ఈదర





క్లబ్ నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఈదర వెంకటేష్

ఒంగోలు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ నూతన అధ్యక్షునిగా ఈదర వెంకటేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం స్థానిక పద్మావతి పంక్షన్ హాల్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు ఈదర వెంకటేష్, కార్యదర్శి గ్రంథే పార్థసారథి కోశాధికారిగా బొమ్మిశెట్టి లక్ష్మణస్వామి.. వారి టీంతో మొదటి డిస్ట్రిక్ గవర్నర్ చందోలు హరిప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్బులో నూతనంగా చేరిన సభ్యులతో రెండో డిస్ట్రిక్ గవర్నర్ లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. విజయ్ చందు, విజయ్ కుమార్ రెడ్డి, నామినేని మోహన్ రావు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ఎస్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.